ప్రజాశక్తి

మంగళవారం 4 మార్చి 2025 5

పార్వతీపురం మన్యం

గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దమడి బాలురు, సీతంపేట బాలికల గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8, 9 తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తానమ తెలిపారు. https://twreiscet.apcfss.in ఆన్లైన్లో ఈనెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 28న ఆన్లైన్ హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు. పరీక్ష ఏప్రిల్ 5న జరుగుతుందని తెలిపారు.

ఉత్కంఠ పోరులో విజేత గాదె

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శ్రీనివాసులునాయుడు
- 'కూటమి' అభ్యర్థి రఘువర్మ ఓటమి
- తడబడిన గురువులు.. చెల్లని ఓట్లే 656

ఓట్ల లెక్కింపులో నిమగ్నమైన అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్సి స్థానానికి జరిగిన ఉత్కంఠ పోరులో పిఆర్టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు గెలుపొందారు. అధికారంలో ఉన్న తెలుగుదేశం, జనసేనకు ఈ ఎన్నికల్లో గురువులు గట్టి గుణపాఠం నేర్పినట్టయింది. కూటమి మద్దతిచ్చిన ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గురువులు ఓడించి గాదెకు మూడోసారి పట్టం కట్టారు. అయితే కూటమిలో భాగస్వామి అయిన బిజెపి మాత్రం రఘువర్మకు గాకుండా పిఆర్టియూ బలపరచిన గాదెకు మద్దతుగా నిలవడంతో కూటమి పార్టీల్లో 8 నెలల తిరక్కముందే రాజకీయ విభేదాలు బయట పడ్డట్టయింది. ఇది టిడిపి కూటమికి తొలి ఎదురుదెబ్బగా పరిశీలకులు భావిస్తున్నారు. టిడిపి మద్దతుతో గత ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎంఎల్సి ఎన్నికల్లో గెలిచిన వేపాడ చిరంజీవిరావు సైతం రఘువర్మకు మద్దతుగా ప్రచారం చేసినా ఉపాధ్యాయులు కన్నెత్తి చూడలేదు. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం, జనసేన విస్తృతంగా రఘువర్మకు తమ తమ నాయకులతో ప్రచారం సాగించినా వారికి ఫలితం దక్కలేదు. 710 ఓట్ల ఆధిక్యతతో గాదె శ్రీనివాసులునాయుడు విజేతగా నిలిచారు.

తొలి రౌండ్ నుంచీ గాదె ఆధిక్యం...

ఎన్నికల్లో పది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ యుటిఎఫ్ బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి, కూటమి మద్దతుతో ఎపిటిఎఫ్ అభ్యర్థి పి.రఘువర్మ, బిజెపి మద్దతిచ్చిన పిఆర్టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు మధ్య ప్రధానంగా పోటీ నెలకొంది. గతనెల 27న జరిగినపోలింగ్లో 20,791 ఓట్లు పోలయ్యాయి. సోమవారం విశాఖ ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలో ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. తొలి ప్రాధాన్యత ఓట్లలో శ్రీనివాసులునాయుడుకు 7272 ఓట్లు, రఘువర్మకు 6905ఓట్లు, విజయగౌరికి 5900 ఓట్లు పోలయ్యాయి. ఓట్లలో 656 ఓట్లు చెల్లలేదు. గెలుపునకు అవసరమైన మెజార్టీ రాకపోవడంతో ఎలిమినేషన్ రౌండ్కు వెళ్లారు. రాత్రి 8గంటలకు రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ముగిసేసరికి శ్రీనివాసులు నాయుడుకు 9237 ఓట్లు లభించగా అధికార కూటమి బలపరచిన సమీప అభ్యర్థి పాకలపాటి రఘువర్మ (ఎపిటిఎఫ్)కు 8527 ఓట్లు లభించాయి. గెలిచేందుకు 10,068 ఓట్లు రావాల్సి ఉండగా, ఎలిమినేషన్ రౌండ్లోనూ ఎవరికీ మెజార్టీ రాలేదు. దీంతో అత్యధిక ఓట్లు సాధించిన గాదె శ్రీనివాసులునాయుడును అధికారులు విజేతగా ప్రకటించారు. రఘువర్మపై 710 ఓట్ల రెండో ప్రాధాన్య ఓటు మెజార్టీతో గాదె గట్టెక్కారు. 8వ రౌండ్లో విజయగౌరి ఎలిమినేట్ అయ్యారు. అంతకు ముందే ఎలిమినేట్ అయిన ఏడుగురులో 15 ఓట్ల లోపు వచ్చిన వారిలో ఇద్దరు పద్మావతి, శివప్రసాద్ ఉన్నారు. 548 చెల్లనిఓట్లు పోలవ్వడంతో గురువులు సైతం ఓట్లు వేయలేకపోయారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి.

ముచ్చటగా మూడోసారి మండలికి

ఫలితాల అనంతరం మీడియాతో మాట్లాడుతున్న గాదె శ్రీనివాసులునాయుడు

పిఆర్టియూ తరపున బరిలోకి దిగిన గాదె శ్రీనివాసులనాయుడు గెలుపుతో 3వ సారి మండలిలో అడుగు పెట్టనున్నారు. రాష్ట్రంలోని కూటమి పార్టీలోని టిడిపి, జనసేన పాకలపాటి రఘువర్మకు మద్దతుగా నిలిచి ప్రచారం చేయగా గాదెకు బిజెపి మద్దతుగా నిలిచింది. శ్రీనివాసులనాయుడు 2007లో పోటీ చేసి ఎంఎల్సిగా గెలిచారు. 2013లో మరోసారి గెలుపొందారు. 2019లో రఘువర్మపై ఓటమి చెందారు. ఈ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మకు టిడిపి, జనసేన మద్దతుగా నిలిచి ప్రచారం మొత్తాన్ని తమ భుజాలపై పెట్టుకుని తిరిగినా టీచర్లంతా తిరస్కరించారు.

ఓడినా ఉపాధ్యాయుల మధ్యే

కోరెడ్ల విజయగౌరి

గెలుపోటములు అనేవి సహజమని, గెలిచినా ఓడినా ఉపాధ్యాయుల మధ్యనే ఉండి పనిచేస్తానని ఈ సందర్భంగా కోరెడ్ల విజయగౌరి అన్నారు. ఫలితాలు సందర్భంగా ఆమె స్పందించారు.

తీర్పును స్వాగతిస్తున్నాను

పాకలపాటి రఘువర్మ

ఉపాధ్యాయుల తీర్పును స్వాగతిస్తున్నానని పాకలపాటి రఘువర్మ అన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై పనిచేసినా ఓడించారని అన్నారు. గతంలో యుటిఎఫ్ మద్దతు ఉండడంతో గెలుపొందానని, ఈ సారి విడిగా పోటీ చేయడంతో ఓటమి చెందానని తెలిపారు. టిడిపి, జనసేన ఆలస్యంగా మద్దతు ప్రకటించాయని అన్నారు.

ప్రాధాన్యతా ఓట్లు ఇలా..

రెండో ప్రాధాన్యత ఓట్లలో వచ్చిన ఆధిక్యతతో గెలుపును గాదె సొంతం చేసుకున్నారు. యుటిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లలో గాదె 1965, పాకలపాటికి 1622 ఓట్లు పోలయ్యాయి. యుటిఎఫ్కి వచ్చిన ఓట్లలో రెండో ఓటు వేయని వారు 2313 మంది ఉన్నారు. ఒకటో ప్రాధాన్యత ఓట్లతో గాదెకు లభించిన మెజారిటీ చూస్తే 367గా ఉంది. రెండో ప్రాధాన్య ఓటుతో గాదెకు వచ్చిన మెజారిటీ 1965 ఓట్లు. గాదె మెజారిటీ మొత్తం 710 ఓట్లు.

పాకలపాటి రఘువర్మ

కూటమి ఓటమి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్కారుకు గురువుల ఝలక్
- పోరాడి ఓడిన పిడిఎఫ్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తాజాగా జరిగిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి (టిడిపి, జనసేన) ఓటమి పాలయ్యాయి. కూటమి బలపర్చిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మపై పిఆర్టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు 710 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. పిడిఎఫ్ అభ్యర్థిగా యుటిఎఫ్ బలపర్చిన కోరెడ్ల విజయగౌరి పోరాడి ఓడారు. మూడో స్థానంలో నిలిచారు. గెలిచిన గాదె, ఓడిన విజయగౌరి సంగతి కాసేపు పక్కనబెడితే... కూటమి ఓటమి మాత్రం ఉమ్మడి విజయనగరం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మునుపెన్నడూ లేని విధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక విషయంలో టిడిపి తలదూర్చింది. కూటమి ధర్మాన్ని పాటిస్తూ జనసేన కూడా సై అంటూ చేతులు కలిపింది. అధినేత ఆదేశాలే తడువుగా ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రులు, పార్టీ నాయకులు తిరగని చోటు లేదు. ఉపాధ్యాయ ఓటర్లకు వంగివంగి నమస్కారాలు పెట్టారు. కొన్నిచోట్ల ఎన్నికల కోడ్ను సైతం ఉల్లంఘిస్తూ స్కూళ్లలోకి చొరబడి ప్రధాన ఉపాధ్యాయుల కుర్చీల్లో కూర్చొని మరీ అధికార దర్పణాన్ని చూపించారు. ఇంతలా అధికార ప్రాభవాన్ని ప్రదర్శించిన కూటమి ఓటమి చవిచూడక తప్పలేదు. ఇక అభ్యర్థి అయితే ఓట్లు అభ్యర్థించడానికి సభలు, సమావేశాల పేరిట విందులు, వినోద కార్యక్రమాలు నిర్వహించి పడరాని పాట్లు పడ్డారు. అయినప్పటికీ ఓటమి తప్పలేదు. దీన్నిబట్టి బెదిరింపులు, అధికార దర్పణాలకు ఉపాధ్యాయులు లొంగిపోరని రుజువైంది. ఉపాధ్యాయులకు సేవ చేసినా ఓడిపోయానని, గతంలో యుటిఎఫ్ మద్దతివ్వడం వల్లే గెలిచానని రఘువర్మ కౌంటింగ్ కేంద్రం వద్ద మీడియాతో అన్నారు.

శ్రీనివాసులు నాయుడు గెలుపునకు సామాజిక సమీకరణాలు, ప్రాంతీయత, గత ఎన్నికల్లో ఓటమి వంటి సెంటిమెంట్ అంశాలు బాగా ఉపయోగపడ్డాయని పలువురు విశ్లేషిస్తున్నారు. విజయగౌరి ఓటమికి అనేక కారణాలు ఉన్నాయి. ఉపాధ్యాయ ఉద్యమ నేతగా గుర్తించిన ఉపాధ్యాయులంతా ఓటేసి అభిమానాన్ని చూపారు. అధికార ప్రతిపక్షాల అండలేకుండా 5900 ఓట్లు సాధించడమంటే చిన్న విషయమేమీ కాదు. అందులోనూ అధికార పార్టీని ఎదురించి ఉపాధ్యాయులంతా ఆమె వెంట నిలబడ్డారు. ఒక్క పైసా కూడా ఖర్చు చేయకుండా పోటీ చేసిన విజయగౌరికి ఉపాధ్యాయులు, అధ్యాపకులు మద్దతిచ్చారు. ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి పోటీలో నిలిచిన విజయగౌరి ఇక ఉపాధ్యాయ, ప్రజా ఉద్యమాల్లో మరింతగా దూసుకుపోతారని యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు.

ప్రశాంతంగా సెకెండ్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలోని 34 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు 404 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డిఐఇఒ మంజులవాణి తెలిపారు. సోమవారం జరిగిన ఈ పరీక్షల్లో జిల్లావ్యాప్తంగా ఇంటర్ సాధారణ పరీక్షలకు 5613 విద్యార్థులకు గాను 5431మంది హాజరుకాగా, ఒకేషనల్ కోర్సులో 2914 విద్యార్థులకు గానూ 2692 విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

మ్యుటేషన్ల పరిష్కారంలో జాప్యం తగదు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రెవెన్యూ సదస్సులు, గ్రామసభల్లో వచ్చిన మ్యూటేషన్ల పరిష్కారంలో జాప్యం తగదని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. తాళ్లబురిడిలో ఎఫ్పిఒఎల్ఆర్ (ఫేజ్ -2)ను సోమవారం సందర్శించారు. భూ సవరణలకు సంబంధించి మ్యుటేషన్ కోసం పెట్టుకున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. గ్రామంలో ప్రైవేటు భూములతో పాటు గ్రామ సరిహద్దులు, నీటి వనరుల, పోరంబోకు భూములను కొలతలు వేసి ఖచ్చితమైన సరిహద్దులను ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా రైతులకు, భూ యజమానులకు శాశ్వత మేలు జరుగుతుందని ఆయన అన్నారు. రీసర్వేలో తప్పులు దొర్లకుండా పక్కాగా నిర్వహించాలన్నారు. మృతి చెందిన రైతుల మ్యూటేషన్లు, న్యాయపరంగా ఎటువంటి సమస్యల్లేని భూములకు చెందిన మ్యూటేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రెవెన్యూ సదస్సులు, గ్రామసభల్లో వచ్చిన సమస్యలను ఆయా విఆర్ఒల లాగిన్లో పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. ప్రత్యేక భూకేసులకు సంబంధించి శిక్షణ ఇచ్చి వాటికి పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వై.జయలక్ష్మి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లావ్యాప్తంగా వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జూన్ మాసాంతం వరకు ఎక్కడా నీటి సమస్య తలెత్త కుండా ముందస్తు ప్రణాళికలు చేయాలని సూచించారు. ఒక వేళ సమస్య వస్తే సంబంధిత ఎంపిడిఒ, ఆర్డబ్ల్యుఎస్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీటి ఎద్దడి ఉన్నచోట అవసరమైతే బోర్లు వేయడం, మరమ్మతులు చేపట్టడం వంటివి చేయాల్సి వస్తే 15వ ఆర్థిక సంఘం, ఐటిడిఎ, జెడ్పీ నిధులను వినియోగించుకోవచ్చని అన్నారు. ఈ పనులన్నీ 15 రోజుల్లో పూర్తికావాలని, నిరంతరం తాగునీరు సరఫరా కావాలని స్పష్టం చేశారు. అయినా ఎక్కడైనా తాగునీటి సమస్యలు తలెత్తితే సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తామని హెచ్చరిం చారు. ప్రతి గ్రామంలో గ్రామ నీటి, పారిశుధ్య కమిటీలు ఉన్నాయని, వారి ఆధ్వర్యంలో ప్రతి నెలా నీటి పరీక్షలు చేసి, రక్షిత మంచి నీరు సరఫరా అయ్యేలా చూడాలని తేల్చిచెప్పారు. పిఎం సూర్యఘర్ యూనిట్ల స్థాపన జిల్లాలో పెరగాలని, ఆ దిశగా అధికారులు కృషిచేయాలని అన్నారు. ముఖ్యంగా యూనిట్ ఏర్పాటు వలన కలిగే ప్రయోజ నాలు, లాభాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పిజిఆర్ఎస్లో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించా లని, రీఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే నిర్ణీత గడువులోగా, నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. గృహ నిర్మాణాలు మరింత వేగవంతం కావాలని, ప్రతి రోజూ మండలంలో వంద ఇళ్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పిఎంజన్మాన్, పిఎంఎవై 2.0 కింద నిర్మితమవు తున్న ఇళ్లపై ఐటిడిఎ పిఒలు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. అలాగే ఎంఎస్ఎంఇల రిజిస్ట్రేషన్ మరింత వేగవంతం చేయాలని తెలిపారు. ఇ - శ్రమ్ కింద జిల్లాలో 3.81 లక్షలు మంది రిజిస్ట్రేషన్ కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 52,297 మంది రిజిస్టర్ అయ్యారని, డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా దీన్ని పూర్తిచేయాలని అన్నారు. జిల్లాలో 94 సెల్ టవర్ల ఏర్పాటుకు బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్టెల్ నెట్ వర్క్కు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, కావున టవర్లు, నెట్ వర్క్ లేని ప్రాంతాలను గుర్తించి గురువారం నాటికి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, హౌసింగ్, డ్వామా, డిఆర్డిఎ, ఐసిడిఎస్ పీడీలు పి.ధర్మచంద్రారెడ్డి, కె.రామచంద్ర రావు, వై.సత్యంనాయుడు, టి.కనక దుర్గ, సిపిఒ పి.వీర్రాజు, డిపిఒ టి.కొండలరావు, జిల్లా ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కర రావు, జిల్లా పశు సంవర్ధక అధికారి డా. ఎస్.మన్మధరావు, జిల్లా మత్స్య శాఖాధికారి వి.తిరుపతయ్య, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, ఆర్డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా బిసి సంక్షేమాధికారి ఎస్.కృష్ణ, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కె.చలపతిరావు, డిఎస్పిఒలు కె.సాయికృష్ణ చైతన్య,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళా దినోత్సవ వేడుకల నిర్వహణపై సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా దినోత్సవ వేడుకల్లో మహిళలందర్నీ భాగస్వాములను చేయాలన్నారు. ప్రేరణ సఖీ కింద ప్రభుత్వ శాఖల్లో ఉన్నత పదవులు అధిరోహించిన మహిళలు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, క్రీడలు, వ్యవసాయంలో రాణించిన మహిళలు, సంగీత కళాకారులు, పారిశుధ్యం, ఆశా, వైద్య రంగంలో విశేష సేవలందించిన మహిళలను గుర్తించాలని అన్నారు. ప్రభుత్వం నుంచి లబ్ధి పొంది ఆర్థికంగా ఎదిగిన మహిళలను కూడా పరిగణలోకి తీసుకోవాలని, ఆ మహిళల ద్వారా ఇతరులు ప్రేరణ పొందాలని అన్నారు. మహిళల ఎంపికలో అన్ని నియోజకవర్గాల్లోని ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాలకు అవకాశం కల్పించాలని సూచించారు.

పెద్దశబ్దాల వల్లే వినికిడి సమస్య

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పరిమితికి మించిన శబ్దాలు వినడం ద్వారా వినికిడి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా డిఇసి (జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రం)లో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతికత జీవనశైలిలో ప్రతి ఒక్కరూ వినికిడి సామర్థ్యానికి అవరోధం లేకుండా జాగ్రత్తపడాలని, చెవులను సురక్షితంగా ఉంచుకోవడం అవసరమని పేర్కొన్నారు. ఒక స్థాయికి మించిన శబ్దాలు తరచుగా వినడం వల్ల మన చెవిలో వినికిడి వ్యవస్థ దెబ్బ తిని క్రమేణా వినగలిగే సామర్థ్యం తగ్గిపోయే ప్రమాదం ఉందని అన్నారు. తక్కువ శబ్దం ద్వారా వినడం (50 డెసిబిల్స్ కంటే తక్కువ) అలవాటు చేసుకోవడం, ఇయర్ ఫోన్స్ వాడకం తగ్గించడం, ఎప్పటికప్పుడు చెవి తనిఖీలు చేయించుకోవడం తద్వారా సమస్యను ముందుగా గుర్తించి తీవ్రతరం కాకుండా నిరోధించవచ్చు అని తెలిపారు. జిల్లా ఆర్బిఎస్కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ పిఎల్ రఘుకుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

సివి రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిఇఒ తిరుపతినాయుడు

ప్రపంచ శాస్త్రవేత్తలుగా ఎదగాలి : డిఇఒ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

విద్యార్థులు ప్రపంచ శాస్త్ర వేత్తలుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ నల్ల తిరుపతినాయుడు ఆకాంక్షించారు. జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా మండలంలోని ఉల్లిభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లాస్థాయిలో విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలతో పాటు సెమినార్ను నిర్వహించారు. తొలుత డాక్టర్ సివి రామన్ చిత్రపటానికి డిఇఒ పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లాలోని ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, సెమినార్, తదితర పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డిఇఒ తదితరులు ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులను అందజేశారు. అనంతరం జరిగిన సభ డిఇఒ మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో రామన్ చేసిన అపారమైన సేవలకు గుర్తుగా ఫిబ్రవరి 28న జాతీయ సైన్సు దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఇటు పాఠశాలకు, అటు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త రెడ్డి తేజేశ్వరరావు, ఉప విద్యాశాఖ అధికారి రాజ్ కుమార్, ఎంఇఒ దత్తి అప్పల నాయుడు, తదితర ఉపాధ్యాయు లు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పార్వతీపురం పట్టణ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆప్కాస్ను రద్దు చేస్తున్నట్లు మంత్రిమండలి ప్రకటించిన నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు గొర్లి వెంకట రమణ, యూనియన్ కమిటీ నాయకులు నాగవంశం మల్లేష్, గుంపు స్వామి, తిరుపతిరావు, నిర్మల, సాగర్, తదితరులు సోమవారం పట్టణంలో నిరసన తెలిపారు. ప్రభుత్వం చేసిన అనాలోచితి నిర్ణయాన్ని నిరసిస్తూ సిఎంకి పోస్ట్ కార్డు ద్వారా లేఖలు రాసి లేఖలను పట్టణంలో బెలగాంలో ఉన్న హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద ఉన్న పోస్టు బాక్సులో వేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఆప్కాస్ వచ్చాక కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ గ్యారెంటీ ఉందని ఇలాంటి విధానాన్ని రద్దు చేసి థర్డ్ పార్టీ తీసుకువస్తే కార్మికుల మరలా దోపిడీ విధానాలు చూడాల్సి వస్తుందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయకుంటే చలో విజయవాడ నిర్వహిం చేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే పిఆర్సి ప్రకటించాలని, పెరిగిన జనాభాకు తగ్గట్టుగా కార్మికుల సంఖ్యను పెంచాలని ఉద్యోగ భద్రత చేపట్టాలని డిమాండ్ చేశారు.

పోస్టుకార్డులు పంపుతున్న మున్సిపల్ కార్మికులు

ఐటిడిఎ పిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

సాగుభూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని గంగాపురం పంచాయతీ తాన్నవలస, తొక్కుడు వలస గ్రామాల్లో గిరిజనులు సాగు చేస్తున్న ప్రభుత్వ భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఐటిడిఎ పిఒ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ తాన్నవలస, తొక్కుడువలస గ్రామాల్లో రీ సర్వే చేసి 6 నెలలు దాటుతున్నా పట్టాలు ఇవ్వలేదని తహశీల్దార్ పట్టాలు ఇస్తామని అంగీకరించినప్పటికీ విఆర్ఒ కొర్రీ వేసి ప్రభుత్వ భూములు గిరిజనులకు కాకుండా చేస్తున్నారనీ అన్నారు. వెంటనే గిరిజనులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. సీతంపేటలో రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వే చేసి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటిడిఎ పిఒకి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాలమెట్ట రాము, వరాలమ్మ, కద్రక చిరంజీవి, మెల్లిక రాము, కొండ గొర్రి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

సవరభాష ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి- సీతంపేట

రాష్ట్ర రాజధాని అమరావతిలో తోటపల్లి గిరిజన సంక్షేమ కమీషనర్ ఎస్. భార్గవి ఆధ్వర్యంలో సవర భాష ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మూడు రోజులు పాటు ఈ శిక్షణ ఉంటుందని ఆ సంఘం నాయకులు ఆనందరావు, డోంబు శ్రీను, భారతి తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ సవర బాషా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడుగురు విద్యార్థులు గైర్హాజరు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షకు సంబంధించి ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ డిజిఎస్‌వి త్రినాధ తెలిపారు. 238 మంది విద్యార్థులకు గాను 231 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

పోలమాంబను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని రాష్ట్ర గిరిజన జాతరగా పేరొందిన శంబర పోలమాంబ అమ్మవారిని సోమవారం పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి దర్శించుకున్నారు. అంతకుముందు జెడ్‌పిటిసి మావుడి శ్రీనివాసరావు స్వగృహం వద్ద వైసిపి పార్టీ మండల అధ్యక్షులు మామిడి రంగునాయుడులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ లక్షణారావు పాల్గొన్నారు.

ఘనంగా ఉమామహేశ్వర యాత్ర

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బురుజోల గ్రామంలో శ్రీ ఉమామహేశ్వర 14వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 5 వరకు యాత్ర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఉమామహేశ్వర ఆలయ ప్రాంగణంలో గ్రామ పురోహితులు రంప జగదీశ్ గుప్త ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. యాత్ర మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు సాయంత్రం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మడపానా కేశవ, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు ఉన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ

ప్రజాశక్తి - భామిని

స్థానిక ఎపి మోడల్ స్కూల్‌లో ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం 6 నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులకు పారా మెడికల్ ఆప్తామాలిక్ వైద్యులు టి. కృష్ణారావు నేత్ర పరీక్షలు నిర్వహించారు. అందులో దృష్టి లోపం ఉన్న 42 మంది విద్యార్థులను గుర్తించి, వారికి కళ్లద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ ఉపాధ్యాయులు, భామిని పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి గ్రామానికి చెందిన వికలాంగ పింఛనదారురుడు శ్రీకాకుళం జేమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వెల్ఫేర్ సహాయకులు ఎన్ రాహుల్ కుమార్ సోమవారం అక్కడికి వెళ్లి పింఛను సొమ్మును అందించారు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - సీతానగరం

ప్రతి వాహనదారుడూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. స్థానిక హనుమాన్ జంక్షన్‌లో వాహనదారులకు నూతన మోటారు వాహన చట్టంపైన సోమవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు మోటారు వాహనాలు ఇవ్వరాదని లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదని అన్నారు. కచ్చితంగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. అలా లేనియెడల కొత్త చట్ట ప్రకారం అపరాధ రుసుము చెల్లించవలసి ఉంటుందని, రెండుసార్లు దొరికితే వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వాహనదారులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కురుపాం

నేషనల్ సైన్స్ డే సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సెమినార్ 'ఎంపవరింగ్ ఇండియన్ యూత్ ఫర్ గ్లోబల్ లీడర్ షిప్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ వికసిత్ భారత్' అనే అంశంపై సోమవారం ఉల్లిభద్ర జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన డిబేట్‌లో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని నెల్లి శ్రీనిధి ఉత్తమ ప్రతిభ కనబర్చింది. 9వ తరగతి చదువుతున్న విద్యార్థి జిల్లా విద్యాశాఖ అధికారి తిరుపతినాయుడు చేతులమీదుగా బహుమతిని అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

భూదేవికి సన్మానం

ప్రజాశక్తి- సీతంపేట

పడాల భూదేవికి కేంద్ర వ్యవసాయ మంత్రి భగీరత్ చౌదరి చేతుల మీదుగా ఘన సన్మానం చేశారు. హైదరాబాద్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిలెట్ రీసెర్చ్ ఐఐఎంఆర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కిసాన్ మేళా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి భగీరత్ చౌదరి, డైరెక్టర్స్ తారా సత్యవతి పాల్గొన్నారు. సమావేశంలో చిరుధాన్యాల అభివృద్ధి, విస్తరణ, పరిశోధనల గురించి చర్చించారు. ఈ చిరుధాన్యాల విస్తరణ, వాల్యూ ఎడిషన్ చేయటం, ఉమెన్ ఎంటర్ప్రెనుర్ తయారు చేయటం మూలంగా పడాల భూదేవిని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి, డైరెక్టర్ తారా సత్యవతి, జాతీయ జీవ వైవిద్య మండలి చైర్మన్ సత్కరించి అవార్డు మెమెంటో అందించారు. భూదేవి మాట్లాడుతూ ఈ సన్మానం తనకు మరింత బాధ్యత పెంచిందన్నారు.

పఠన నైపుణ్యాలను పెంపొందించాలి

ప్రజాశక్తి- బలిజిపేట

ఒకటి నుండి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే తెలుగు, ఆంగ్ల భాషల్లో పఠన నైపుణ్యాలను, లేఖన నైపుణ్యాలను పెంపొందించాలని ఎంఇఒ 1 సామల సింహాచలం అన్నారు. సోమవారం ఆయన పి.చాకరాపల్లి, మురగడాం, అజ్జాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల డైరీలు లెసన్ ప్లాన్స్ పరిశీలించారు. పాఠశాలలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగించి విద్యార్థులకు బోధించాలన్నారు. విద్యార్థులతో తెలుగు, ఆంగ్ల పాఠాల్ని చదివించారు. వర్క్ బుక్స్‌ను పరిశీలించి విద్యార్థుల్లో చేతిరాత నైపుణ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ విషయాలను కూడా విద్యార్థులకు ప్రాక్టీస్ చేయించాలని, ఎఫ్ఏ 4 పరీక్షలను చక్కగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిఆర్‌ఎంటి పాల్గొన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం - 2025ను పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా సాధికార వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం స్థానిక సురేష్ పాఠశాలలో రూరల్ ఎస్సై సంతోషి కుమారి ఆధ్వర్యంలో ముందుగా ఆటలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు సైబర్ క్రైమ్, ఫోక్సో, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, బాల కార్మిక చట్టాలు, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలు, ఆకతాయిల వేధింపుల/ ర్యాగింగ్ నుంచి రక్షణ, సామాజిక మాధ్యమాల వినియోగం వంటి పలు మహిళా సంబంధిత నేరాలపై అవగాహన నిర్వహించారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ పిఒ జాగాన విజయలక్ష్మి హెచ్చరించారు. మహిళా వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని 17, 19, 26 వార్డులు, మల్లమ్మపేటలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కొవ్వొత్తులతో ర్యాలీ చేసి ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమన్నారు. బాల్య వివాహాలు చేస్తే బాలికల అనారోగ్యం బారిన పడతారని చెప్పారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగితే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, తల్లులు, బాలికలు పాల్గొన్నారు.

పెట్టుబడిదారులకు స్వాగతం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు వచ్చే పెట్టుబడిదారులను స్వాగతిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా పర్యాటక అభివృద్ధి మండలి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీసార్ట్స్, బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, లోటస్ గార్డెన్ వంటి వాటిని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే పెట్టుబడిదారులను స్వాగతిస్తామని, వారికి కావాల్సిన అన్ని మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. ముందుగా పెట్టుబడిదారులు పర్యాటకశాఖతో ఒప్పందం చేసుకొని, ఆ శాఖ ద్వారా తమకు నివేదికను అందజేస్తే, వాటిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో తోటపల్లి, వెంగళరాయసాగరం, పెద్దగెడ్డ వంటి రిజర్వాయర్లు ఉన్నాయని, ఆయా ప్రాంతాల వద్ద బోటింగ్, వాటర్ స్పోర్ట్స్ వంటివి ఏర్పాటు చేసేందుకు అనుకూలంగా ఉంటుందని అన్నారు. పార్వతీపురం, సాలూరు, పాచిపెంట ప్రాంతాలకు ఇవి దగ్గరగా ఉంటాయని, సెలవు రోజుల్లో ఎక్కువగా పర్యాటకులు వచ్చేందుకు అవకాశం ఉందని కలెక్టర్ వివరించారు. అలాగే తోటపల్లి వద్ద గల ఐటిడిఎ పార్కును అభివృద్ధి చేయాలని సూచించారు. అడలి వ్యూ పాయింట్ వద్ద రక్షణ గోడలు, రహదారి పనులు, రెండు గదుల నిర్మాణాలు వీలైనంత త్వరగా పూర్తికావాలని, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంలో బడ్జెట్ హెూటల్ నిర్మాణానికి ముందుకు వచ్చిన పెట్టుబడిదారులకు స్థలాన్ని అప్పగిస్తామని, ప్రభుత్వం ఇందుకు రాయితీలను ప్రకటించిందని కలెక్టర్ గుర్తుచేశారు. అరుకు - సాలూరు - పార్వతీపురం మీదుగా మందస వరకు గల సర్క్యూట్ టూరిజంను వీలైనంత త్వరగా ప్రతిపాదనలు పంపి ప్రారంభించాలని సూచించారు. జగతిపల్లి రీసార్ట్స్ వద్ద చేపట్టాల్సిన పెండింగ్ పనులపై దృష్టి సారించాలని అన్నారు. తోటపల్లిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా పర్యాటక అధికారి యన్.నారాయణరావు, డిపిఒ టి.కొండలరావు, అడ్వంచర్ అండ్ వాటర్ స్పోర్ట్స్ డైరక్టర్ బి.బలరాంనాయుడు, ఇరిగేషన్ ఇఇ ఆర్.అప్పలనాయుడు, తోటపల్లి రిజర్వాయర్ డిఇ టి.రఘునాథనాయుడు, దేవాదాయ శాఖాధికారి ఎస్.రాజారావు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్‌డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, సాలూరు మునిసిపాలిటీ మేనేజర్ బి.ఎం.శివప్రసాద్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్, జట్టు ఆశ్రమం పారినాయుడు, వివిధ హెూటళ్లు, రెస్టారెంట్ల ప్రతినిధులు, పెట్టుబడి దారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జలవనరుల అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేయండి

జలవనరుల అభివృద్ధికి సంబంధించి చెరువుల పునరుద్ధరణ, చెక్ డ్యాములకు ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు సమగ్ర ప్రణాళికలు రచించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జలవనరుల శాఖపై కలెక్టరేట్‌లో సమీక్షించారు. ముందుగా జలవనరుల పథకాలపై సమీక్ష సోలార్ ప్లాంట్, కార్తీకవనాల ఏర్పాటుకు భూములను గుర్తించాలని ఆదేశించారు. తోటపల్లి, వెంగలరాయపురం వద్ద సాగర్ పార్కుల ఏర్పాటుకు అంచనాలను రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఇఇ ఆర్.అప్పలనాయుడు, భూగర్భ జలవనరుల శాఖ అధికారి ఏ.రాజశేఖర్ రెడ్డి, పలు రిజర్వాయర్ల పర్యవేక్షక, ఉప కార్యనిర్వాహక, కార్యనిర్వాహక, సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

కాటాను పరిశీలిస్తున్న అధికారులు

సంతలో జిసిసి కాటా

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సంతలో జిసిసి కాటా వేశారు. కిలో చింతపండు రూ.36 చొప్పున కొనుగోలు చేశారు. అదేవిధంగా కొండచీపుర్లు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ప్రతి సంతలోనూ గిరిజన ఉత్పత్తులు నోటీస్ బోర్డ్‌లో ఉన్నవి ధరలు పట్టిక ప్రకారం కొనుగోలు చేస్తున్నామని అన్నారు. అలాగే గిరిజన రైతులకు నగదు వెంటనే చెల్లిస్తున్నామని చెప్పారు. ప్రతి సంతకు వెళ్లి కొనుగోలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సేల్స్‌మేన్లు పాలక దుర్గారావు, సురేష్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత పాలనకు కేరాఫ్ టిడిపి

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి- సాలూరు

మోసపూరిత పాలనకి కేరాఫ్ అడ్రస్‌గా టిడిపి కూటమి ప్రభుత్వం మారిందని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. సోమవారం రాజన్నదొర నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అదికారంలోకి రావడానికి ముందు లేనిపోని హామీలివ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను ఎగ్గొట్టడం టిడిపికి అలవాటుగా మారిందని చెప్పారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలోకి రావడానికి ముందు టిడిపి ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి మోసం చేసిందని గుర్తు చేశారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు సంపూర్ణ రుణమాఫీ చేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత చేతులెత్తేసిందని చెప్పారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం హయాంలో డ్వాక్రా రుణమాఫీ చేసినట్లు తెలిపారు. అనాడు వైసిపి హామీ ఇవ్వకపోయినా సిఎం జగన్ మోహన్ రెడ్డి రుణమాఫీ అమలు చేశారని చెప్పారు. సూపర్ సిక్స్ పేరుతో ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ప్రజలకు మొండిచేయి చూపిస్తోందని అన్నారు. ఇంతవరకు ఏ హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదని చెప్పారు. రెండు సార్లు ప్రవేశపెట్టిన బడ్జెట్‌ల్లో సూపర్ సిక్స్ హామీల అమలుపై స్పష్టత లేదని చెప్పారు. ఇచ్చిన హామీల అమలు చేతకాక రాష్ట్రం అప్పులపాలయిందంటూ జగన్ మోహన్ రెడ్డి పై టిడిపి నాయకులు తప్పుడు విమర్శలు చేస్తున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వం హయాంలో చేసిన అప్పులతో నవరత్నాలనే సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే లక్ష కోట్ల అప్పు చేసిన ఘనత టిడిపి ప్రభుత్వానిదేనని అన్నారు. లక్ష కోట్ల రూపాయల అప్పు తో సూపర్ సిక్స్ పథకాల అమలు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఈ ఏడాది రూ.3.22 లక్షల కోట్ల బడ్జెట్‌ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దానిలో రూ.2.17 లక్షల కోట్లు ఆదాయం వస్తోందని చెప్పిందని తెలిపారు. అంత ఆదాయం వస్తున్నప్పుడు సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ వ్యవహార్శైలి చూసి జనసైనికులే గందరగోళంలో వున్నారని, మరో 15 ఏళ్ళు చంద్రబాబు నాయుడే సిఎంగా వుండాలని పవన్ కళ్యాణ్ చెప్పడంపై జనసేన నాయకులు, కార్యకర్తలే అసంతృప్తితో రగిలిపోతున్నారని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సొంత నియోజకవర్గంలో 20మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ చిరుద్యోగులను అన్యాయంగా తొలగించారని చెప్పారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా తాను ఏనాడూ చిన్న చిన్న ఉద్యోగుల జోలికి పోలేదని రాజన్నదొర చెప్పారు. ఈ సమావేశంలో వైసిపి సీనియర్ నాయకులు పాచి పెంట చినబాబు, పాలకొండ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

వ్యాధి లక్షణాలు గుర్తించాలి

ప్రజాశక్తి - కొమరాడ

రికార్డులను పరిశీలిస్తున్న జగన్మోహన్

గ్రామాల్లో వ్యాధి లక్షణాలు సకాలంలో గుర్తించడంపై దృష్టి సారించాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్మోహనరావు, డా పిఎల్. రఘుకుమార్ వైద్య సిబ్బందికి సూచించారు. గుణానుపురంలో సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. హెల్త్, వెల్నెస్ కేంద్రంలో నిర్వహించిన ఎఫ్‌డిపి కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అక్కడ వైద్య సేవలు వినియోగించుకుంటున్న గ్రామస్తులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బిపి, మధుమేహం దీర్ఘకాలిక రుగ్మతలకు మందులు వినియోగిస్తున్న తీరు, ఏ మేరకు ఆరోగ్యం మెరుగుపడుతుంది తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది వారికి నిర్వహించిన ఆరోగ్య పరీక్షలు పరిశీలించారు. గర్భిణులకు నిర్వహించిన వైద్య తనిఖీల వివరాలు ఎంసిపి కార్డులో పరిశీలించి హైరిస్క్ గర్భిణీల ఆరోగ్యాన్ని తరచుగా పర్యవేక్షించాలన్నారు. ఆశా, సిహెచ్ డబ్ల్యులు ఎప్పటికప్పుడు గృహ సందర్శనలు చేసి దీర్ఘకాలిక రోగులు, గర్భిణీ, బాలింతలు వారికి నిర్దేశించిన ప్రకారం మందులు వేసుకుంటున్నారా అని పర్యవేక్షించాలన్నారు. అనంతరం ఎన్సీడి సర్వేపై ఆరా తీసి ఆన్లైన్‌లో పరిశీలించి ఇప్పటి వరకు పూర్తి చేసిన వివరాలు తక్కువగా ఉండడాన్ని గమనించి నిర్దేశించిన సమయానికి సర్వే పూర్తి చేయాలని, అలాగే వ్యాధి లక్షణాలు గుర్తించాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల్లో ఇటు క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్యం కొరకు గ్రామీణ ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని, అందుబాటులో ఉన్న అన్ని ఉచిత వైద్య సేవలపై అవగాహన కల్పించి తగు మార్గ నిర్దేశనం చేయాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.శిరీష, సూపర్వైజర్ విజయనిర్మల, వైద్య సిబ్బంది వర్షిణి, శ్రావణి, 104 సిబ్బంది తదితరులు ఉన్నారు.

నిత్యం వైద్యులు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజలకు నిత్యం వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ పద్మావతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ముందుగా ఆసుపత్రిలో ఉన్న అన్ని విభాగాలకు చెందిన రికార్డులతో పాటు హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న విద్యార్థుల భవిత కార్డుల స్థితిగతులను తెలుసుకున్నారు. గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో తనిఖీ చేసి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిలపై ఆరా తీశారు. భవిత కార్డుల్లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం గంగరేగు వలస సబ్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాల్లో భాగంగా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అన్ని సర్వేలను సక్రమంగా చేపట్టాలన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాల్లో సందర్శించి ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించాలన్నారు. ముఖ్యంగా గర్భిణీ బాలింతల్లో రక్తహీనత నివారణకు చేపడుతున్న చర్యల్లో మరింత పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి అరుణ్ కుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ప్రజాశక్తి- సీతంపేట

రాబోవు వేసవికాలం దృష్ట్యా ఐటిడిఎ పరిధిలోని గిరిజన గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ఎద్దడి నెలకొన్న గిరిజన గ్రామాల వివరాలు సేకరించి అందుకు తగ్గట్టుగా నీటి సరఫరాకు ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. తాగునీటి సమస్య ఉన్న ప్రతి గ్రామానికి నీరు సరఫరా చేసేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఏటా ట్యాంకుల ద్వారా సరఫరా చేసే పద్ధతికి బదులుగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. చెక్ డ్యామ్ నిర్మాణాలకు ప్రణాళికలు తయారు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పిఒ అన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ గీతాంజలి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ మధుసూదన్‌రావు, నాలుగు మండలాల ఎఇలు సత్యం, పాపారావు, ఇరిగేషన్ శాఖ డిఇ పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఇంజనీరింగ్ విభాగం ద్వారా జరుగుతున్న అన్ని రకాల పనులనూ వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. మల్టీపర్పస్ సెంటర్ల పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సీసీడీపీ ద్వారా చేపడుతున్న పనులను కూడా పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించ కూడదని అన్నారు. పూర్తయిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈ రమాదేవి, డిఇలు సింహాచలం, కృష్ణకుమార్, సిమ్మన్న, ఎఇలు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న పిఒ యశ్వంత్‌కుమార్

తాగునీటి సమస్య పరిష్కారానికి క్రాష్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వేసవిలో తాగు నీటి సమస్య పరిస్కారానికి క్రాష్‌ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఒ సాల్మన్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రారంభించారు. మండలంలోని 27 పంచాయతీల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి అక్కడ బోర్లు, రక్షిత మంచినీటి పథకాలు మరమ్మతులు చేపట్టడం ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించే ఉద్దేశంతోనే క్రాస్ ప్రోగ్రాం ముఖ్యోద్దేశమన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉన్నట్లయితే ప్రజలు సమాచారం అందించాలని, తద్వారా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు గ్రామానికి వచ్చి బోర్లు మరమ్మతులు చేసి తాగునీరందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ధర్మారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రవీణ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

జియ్యమ్మవలసలో...

మండుటెండలకు ప్రజలు మంచినీటికి ఎలాంటి ఇబ్బందీ పడకుండా ఉండేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని జియమ్మవలస ఎంపిడిఒ ఎస్.రమేష్ తెలిపారు. మండలంలోని 31 పంచాయతీలకు సంబంధించి అన్ని గ్రామాలకు ఈనెల 1 నుంచి 30 వరకు క్రాస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంచినీటికై ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఉండేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. అలాగే అవసరమైన చోట్ల హేండ్ బోర్లను, సోలార్ పవర్ బోర్లను మరమ్మతు చేస్తున్నామని తెలిపారు.

చలో పిఠాపురం పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈనెల 14న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని, ఈ వేడుకలలో జనసేన పార్టీకి చెందిన ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆ పార్టీ నాయకులు చందక అనిల్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో జనసేనపార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు చందక అనిల్ అధ్యక్షతన ముఖ్య నాయకులు సమావేశమై ఛలో పిఠాపురం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నెయ్యిగాపుల సురేష్, సిరిపురపు గౌరీ, భమిడిపాటి చైతన్య, రెడ్డి నాగరాజు, గునాన నరేష్, బంటు శిరీష్, చింతాడ ముఖేష్, అన్నాబత్తుల దుర్గ, నెయ్యిగాపుల సంతోష్, వహబ్, సంబాణ రమేష్, కోరాడ మౌళి, రేవంత్, గేదెల వంశీ, పతివాడ వంశీ, వీరపిండి గణేష్, సంబన కుర్మరావు, కునుకు రమేష్, బూర్లి కిరణ్, రెడ్డి కామేష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

తోటపల్లి జట్టు ట్రస్ట్ నూతన కార్యాలయంలో పార్వతీపురం, బలిజిపేట, సీతానగరం, సాలూరు, పాచిపెంట, మక్కువ, వీరఘట్టం, పాలకొండ మండలాలకు చెందిన 120 మంది ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు 3రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని వ్యవసాయశాఖ, డిఆర్‌డిఎ, ఎన్‌జిఇఆర్‌ఎస్, సెరీకల్చర్, హార్టికల్చర్, మొదలగు అన్ని శాఖల సమన్వయంతో కలిసి ఖరీఫ్ ప్రణాళిక తయారు చేసుకోవాలని, ప్రతి రైతు పూర్తి స్థాయి వివరాలు, ఎంత విస్తీర్ణం, ఎన్ని రకాల పంటలు పండిస్తున్నారు, మొదలగు వివరాలు ఆన్లైన్‌లో నమోదు చేయాలని, రైతులు 365 రోజులు భూమిని కప్పి ఉంచేలా పంటలు వేసుకుని రైతులు లాభదాయకంగా, నిరంతర పంటలు - నిరంతర వైవిద్యం - నిరంతర ఆదాయం పొందేలా కార్యకర్తలు కృషి చేయాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, నవధాన్యాలు వేసి దిగుబడులు సాధించిన రైతులు అనుభవాలను శిక్షణలో వివరించారు. ఈ శిక్షణలో నేర్చుకున్న వివరాలు తమ గ్రామాల్లో తక్షణమే ఆచరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్ఎలు జి.అన్నపూర్ణ, వై.తిరుపతి, ఆర్.శ్రీనివాస్, శారద, ముసలయ్య, దేవీప్రసాద్, బాలు, శ్రీరామ్, అంబోజీ, స్వామి నాయుడు, పాల్గొన్నారు.

ఘనంగా వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష, జంతుశాస్త్రాల విభాగాలు, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2, కాలేజీ ఐక్యూఎసి, అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.జయమణి అధ్యక్షతన ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.జయమణి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ అడవిలో నివసిస్తున్న వన్యప్రాణులు మనకు తెలియకుండానే మానవాళికి అనేకమైన అనారోగ్య సమస్యలు బారిన పడకుండా ఎంతగానో రక్షిస్తున్నాయని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎఫ్ఆర్ఒ కె.రామారావు మాట్లాడుతూ వన్యప్రాణి సంరక్షణ మన అందరి బాధ్యతని, కావున ప్రతి ఒక్కరూ తన చుట్టూ ఉన్న జీవసంపదను పరిరక్షించుకునే ప్రయత్నం చేయాలని కోరారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి మాట్లాడుతూ వి.జనార్దన్‌రావు మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్నో వృక్ష, జంతు సంపద అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని, ఆ తర్వాత తరాలకు వాటిని చూసే అదృష్టం లేకుండా పోతుందని అన్నారు. కావున ప్రతి వ్యక్తి తన బాధ్యతగా వన్యప్రాణులను పరిరక్షించుకోవాలని కోరారు. కార్యక్రమలో ఎఫ్ఎస్ఒలు పి.రవిబాబు, జె.సోమేశ్వరరావు, ఎఫ్‌బిఒలు, కళాశాల అధ్యాపకులు ఎం. శాంతి పి రాజ్యలక్ష్మి, కూన శ్రీనివాసరావు, జంతు శాస్త్ర ఉపన్యాసకులు తిరుపతిరావు, ఉపేంద్ర, ఇతర అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

దగ్ధమైన ఇల్లు పరిశీలన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలో గల దుర్గ అమ్మవారి ఆలయం పక్కనున్న ధర్మవరపు పార్వతి పూరిల్లు ఈనెల 1న అగ్నికి ఆహుతైంది. ఈ విషయం తెలుసుకున్న మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎన్.లక్ష్మునాయుడు సోమవారం ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ ప్రమాదంలో రూ.20వేలు నగదు, టీవీ, ఫ్యాన్, బీరువా, వంటసామాగ్రి, మొబైల్ ఫోన్, 8 కోళ్లు, 30 కిలోల బియ్యం, 13 తులాల వెండి, అర తులం బంగారం అగ్నిప్రమాదంలో బూడిదయ్యాయి. ఈ వివరాలను నమోదు చేసి నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు ఆర్ఐ తెలిపారు. విచారణలో విఆర్ఒలు శ్రీనివాసరావు, దుర్గారావు ఉన్నారు.

డీహైడ్రేషన్ కాకుండా నీరు ఎక్కువగా తీసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

వేసవిలో శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండాలంటే, నీటిని ఎక్కువగా తీసుకోవాలని మొండెంఖల్ పిహెచ్‌సి వైద్యాధికారి బి.ప్రజ్ఞ అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఎండలు తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వేడి, తేమ వాతావరణం వల్ల వచ్చే వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి రోజుకు కనీసం 4 లీటర్ల మంచినీరు మంచినీరు తాగాలని, వదులుగా ఉండే దుస్తులు ధరించి బయటికి తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వచ్చినప్పుడు గొడుగు, హెల్మెట్, గ్లౌజ్‌లు వేసుకొని వెళ్లాలని, తీసుకునే ఆహారంలో తగినంత ఉప్పు, నీరు, పోషకాలు ఉన్నటువంటి పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తాగి జాగ్రత్తలు అన్ని పాటిస్తే ఎండ నుంచి కొంతవరకు ఉపశమనం పొంది ఆరోగ్యంగా ఉండొచ్చని అన్నారు.

అంతర పంటలతో లాభాలు

ప్రజాశక్తి - మక్కువ

అంతర్ పంటల సాగువల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారిని బి.శ్యామల అన్నారు. మండలంలోని మార్కొండ పుట్టి పంచాయతీ బట్టివలసలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.శ్యామల సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక రైతు వేమూరి కోటేశ్వరరావు ప్యాక్‌హౌస్‌ను, ఫారంపాండ్‌లను సందర్శించారు. అనంతరం వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వొక్క తోటలను, దానిలో ఉన్న జాజికాయ, మిరియాల అంతర్ పంటలను ఆమె పరిశీలించారు. అంతర్ పంటల వల్ల వచ్చే దిగుబడులు పలు అంశాలపై రైతు కోటేశ్వరరావుతో చర్చించారు. కార్యక్రమంలో స్థానిక హెచ్ఒ ప్రత్యూష భాను, సాలూరు హెచ్ఒ బి.ఝాన్సీ, స్థానిక విహెచ్ఎ సత్యవతి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సీత పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - పాలకొండ

వేసవిలో నగర పంచాయతీలో తాగునీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్ అన్నారు. సోమవారం నగర పంచాయతీలో కౌన్సిలర్లతో తాగునీటి సమస్యపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ ప్రజల అవసరాలు తీర్చడానికి తామంతా కట్టుబడి ఉన్నామన్నారు. 20 వార్డుల్లో ఎక్కడా నీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తమ సిబ్బందిని పంపించి ఎక్కడ సమస్యలుంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. నగర పంచాయతీలో అవినీతి ఆరోపణల విషయంలో తమకేమీ తెలియదని, అయినప్పటికీ సిబ్బందితో కలిసి సమీక్షిస్తామని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, బాసూరు కాంతారావు, తూముల లక్ష్మణరావు, కోడం విజయకుమార్, మేనేజర్ జయరాం ఉన్నారు.

నేరాలు ఘోరాలు

ఎదురెదురుగా బైకులు ఢీ ఒకరికి గాయాలు

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

మండలంలోని పెదమరికి సమీపంలో ఎదురెదురుగా వచ్చిన బైకులు ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం జరిగింది. గరుగుబిల్లి మండలం మరుపెంటకు చెందిన జి.శంకర్రావు తన ద్విచక్ర వాహనంపై కొత్త ఊరు గ్రామ వెళుండగా అదేమార్గంలో ఒడిశా నుండి ఎదురుగా వస్తున్న వ్యక్తి బలంగా ఢీకొనడంతో శంకర్రావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108 వాహనంలో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం విశాఖ తరలించారు. అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో హెచ్‌ఎం ప్రకాశందొర మృతి

ప్రజాశక్తి మక్కువ

మండల కేంద్రంలో ఎస్ఎన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాడంగి ప్రకాశందొర గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందారు. కొమరాడ మండలం కుమ్మరిగుంటలో ప్రకాశం దొర జన్మించారు. ఉద్యోగరీత్యా బొబ్బిలి పట్టణంలో నివాసం ఉంటున్నారు. ఆదివారం అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఆయన ఇంటి వద్ద మృతి చెందారు. ప్రకాశం దొర మృతిపట్ల స్థానిక ఎంఇఒలు రెంట సత్యనారాయణ, వై.శ్యామసుందర్‌లు పాఠశాలలో పనిచేస్తున్న సహ ఉపాధ్యాయులు, యుటిఎఫ్ ఇతర ఉపాధ్యాయ సంఘాలు తమ సంతాపాన్ని ప్రకటించాయి.